అస్తవ్యస్తంగా మ్యాన్‌హోళ్లు


ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ రోడ్డులో అధ్వానంగా మ్యాన్‌హోల్


అంబేడ్కర్ కాలనీలో గోతులమయంగా మ్యాన్‌హోల్


కేఆర్‌ఎం కాలనీలో మ్యాన్‌హోల్ వద్ద గోతులు


కేఆర్‌ఎం కాలనీ రోడ్డులో ప్రమాదభరితంగా యూజీడీ మ్యాన్‌హోల్

- రహదారుల్లోని యూజీడీ గోతులతో ఇబ్బందులు
- ప్రమాదాల బారిన స్థానికులు, వాహన చోదకులు
- 16, 23 వార్డుల్లో ఇదీ పరిస్థితి
- పట్టించుకోని ఇంజినీరింగ్ అధికారులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16, 23 వార్డుల్లోని భూగర్భ డ్రైనేజీలు డేంజర్ బెల్స్ మోగిస్తున్నాయి. ఎక్కడికక్కడ అస్తవ్యస్తంగా యూజీడీ మ్యాన్‌హోళ్ల నిర్మించడంతో స్థానికులకు, వాహన చోదకులకు ప్రాణసంకటంగా మారాయి. ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిర్వహించిన అభివృద్ధి పనులు ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. కొన్నిచోట్ల చేపట్టిన అరకొర పనులు ప్రజలకు అవస్థలు తెచ్చి పెడుతున్నాయి. ముందస్తు ప్రణాళిక, భవిష్యత్తులో రాబోయే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని యూజీడీ పనులు చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

జీవీఎంసీ యూజీడీ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. మ్యాన్‌హోళ్లను రోడ్డుకు సమాంతరంగా కాకుండా ఒక దగ్గర ఎత్తుగానూ, మరోచోట కిందగా గోతుల్లో నిర్మించడంతో తంటాలు పడుతున్నామని చెబుతున్నారు.

గోతులమయం..

జీవీఎంసీ 23వ వార్డులో నిర్మించిన యూజీడీ మ్యాన్‌హోళ్లు కొన్ని చోట్ల గోతులను తలపిస్తున్నాయి. డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల రోడ్డు నుంచి మద్దిలపాలెం శివాలయం వైపు వెళ్లి రహదారిలోని మ్యాన్‌హోళ్లు ప్రయాణికులను భయపెడుతున్నాయి. ఈ రోడ్డులో నిర్మించిన మ్యాన్‌హోళ్ల పెద్ద గోతుల్లా కనిపిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాలు యూజీడీ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. గోతుల్లాంటి మ్యాన్‌హోళ్ల వల్ల తమ వాహనాలు పాడవుతున్నాయని, వీటి మరమ్మతులకు చేతిచమురు వదిలించుకోవాల్సి వస్తోందని చోదకులు వాపోతున్నారు.

మ్యాన్‌హోల్ లీకేజీతో దుర్వాసన

మద్దిలపాలెం శివాలయం రోడ్డులో ఒక చోట గోతిలో ఉన్న మ్యాన్‌హోల్ లీకవుతూనే ఉంది. యూజీడీ ఇంజినీర్లు పట్టించుకోకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో దుర్వాసన వెదజల్లుతోంది.

ప్రమాదభరితం..

జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట అంబేడ్కర్ కాలనీల్లోని రహదారుల్లో యూజీడీ మ్యాన్‌హోళ్లు ప్రమాదభరితంగా మారాయి. మద్దిలపాలెం శివాలయం నుంచి సీఎంఆర్ శశ్మానవాటిక వైపు గల రోడ్డులో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాల్లో ప్రతి మ్యాన్‌హోల్ చుట్టూ గుంతలు ఏర్పడ్డాయి. ఒక్కో కాలనీలో పదుల సంఖ్యలో మ్యాన్‌హోల్ గోతులు దర్శనమిస్తున్నాయి. వాహనాలపై రాకపోకల సమయంలో మ్యాన్‌హోల్ గోతులు కనిపించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో కొన్ని చోట్ల వీధిలైట్లు సరిగ్గా వెలగకపోవడంతో గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహన చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినా.. ఎటువంటి ప్రయోజనం లేదని చెబుతున్నారు. ఈ సమస్యపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

మర్యాదపూర్వక కలయిక


డీఈవో ప్రేమ్‌కుమార్‌కు జాబితా అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

విశాఖ విద్య: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కమిటీ ఏర్పాటైన నేపథ్యంలో బుధవారం జిల్లా బాధ్యులంతా కలసి డీఈవో ఎస్.ప్రేమ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ విజయవంతమయ్యేలా సంఘం పూర్తి స్థాయిలో సహకరిస్తుందన్నారు. సమస్యల పరిష్కారంలో ఉపాధ్యాయుల పక్షాన నిలిచి, వాటి పరిష్కారం కోసమని ప్రాతినిధ్యం వహిస్తామని, ఇందుకు జిల్లా విద్యా శాఖాధికారులు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. డీఈవోను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, సహాధ్యక్షుడు, విశాఖ నగర అధ్యక్షుడు సుదర్శన్ పట్నాయక్, కోశాధికారి కె.సన్యాసినాయుడు, జిల్లా మహిళా కార్యదర్శి ఎ.రామలక్ష్మి తదితరులున్నారు.

యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార: వివాహం కావడం లేదని మనస్తాపానికి గురైన ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. షేక్ ఫిరోజ్(30) అక్కయ్యపాలెం చిన్నూరు మసీదు ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడికి పెళ్లి కాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇంట్లో విగత జీవిగా కనిపించిన కొడుకుని చూసి తండ్రి పెద్ద కేకలు వేయడంతో స్థానికులు చేరుకొని ఫోర్త్‌టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ జి.వెంకటరావు, హెచ్‌సీ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఏయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్స్‌లో నిర్వహించిన ఈ తరంగ్–2025 ఫెస్ట్‌లో భాగంగా జరిగిన ఆర్ట్ పోటీల్లో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ప్రతిభ చూపారు. డిపార్ట్‌మెంట్ విద్యార్థులు ఏడు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు అభినందించారు. శతాబ్ది ఉత్సవాల్లో చిత్రకళా విభాగం విద్యార్థులు తమ కళా ప్రతిభతో ఆకట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి డి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల కోసం నీటి కుండీల ఏర్పాటు


కంబాలకొండలో నీటి కుండీ

ఆరిలోవ: వేసవి నేపథ్యంలో బహిరంగంగా తిరిగే వన్యప్రాణుల దాహం తీర్చడానికి అటవీ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా అటవీ ప్రాంతాల్లో నీటి కుండీలు ఏర్పాటు చేస్తున్నారు. కంబాలకొండ ఎకో టూరిజం పార్కు పరిసరాలతోపాటు జూ పార్కులో వీటిని ఏర్పాటు చేశారు. కంబాలకొండ పార్కులో కొండల అంచున, నిర్మానుష్య ప్రదేశాల్లో సిమెంట్ కుండీలు ఉంచి ప్రతి రోజు నీరు పోస్తున్నారు. కంబాలకొండ నీటి కొలను చుట్టూ, జూ పార్కులో కొండ అంచున పలుచోట్ల ఈ కుండీలను అమర్చారు. వాటిలో వేసిన నీటిని బాహ్యప్రపంచంలో తిరుగుతున్న వన్యప్రాణులు తాగుతూ దాహం తీర్చుకుంటున్నాయి.

మొక్కలకు రక్షణగా ఆకుపచ్చ తెర


ఆర్కే బీచ్ వద్ద నాటిన మొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసిన తెర

ఏయూక్యాంపస్: సాగర తీరంలో మొక్కలను పెంచడం ఎంతో క్లిష్టమైన అంశం. ఒక్కో మొక్కను సముద్రం నుంచి వచ్చే ఉప్పుగాలి నుంచి రక్షిస్తూ, ఎండ తీవ్రత నుంచి కాపాడుతూ సంరక్షించాలి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆర్కే బీచ్ వద్ద కొత్తగా నాటిన మొక్కలకు ఆకుపచ్చని తెరతో రక్షణ కల్పించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మొక్కలు దెబ్బతినకుండా ఒకు పచ్చని తెర రక్షణగా నిలుస్తోంది. సముద్రం పైనుంచి వచ్చే ఉప్పు గాలి నేరుగా మొక్కలకు తగల కుండా కొంత వరకు ఆపడం దీనితో సాధ్యపడుతోంది.

భగవద్గీత కేంద్రంగా ప్రత్యేక క్యాలెండర్

బీచ్‌రోడ్డు: సంప్రదాయ భారతీయ క్యాలెండర్‌తో నూతన సంవత్సరాన్ని శుభప్రదంగా ఆరంభించడానికి భగవద్గీత కేంద్రంగా విశిష్టమైన 18 నెలల క్యాలెండర్ రూపొందించామని సైకిల్ ప్యూర్ అగర్బత్తి ఎండీ అర్జున్ గంగ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం క్యాలెండర్ వివరాలను వెల్లడించా రు. ఈ క్యాలెండర్ ద్వారా భగవద్గీతలోని జ్ఞానాన్ని ఆధునిక తరాలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ప్రత్యేక క్యాలెండర్‌లో 18 అద్భుతమైన శ్రీకృష్ణుడి చిత్రాలు కలవని, భారతీయ సంప్రదాయ చిత్రకళా శైలులను ఉపయోగించి వేసినవన్నారు. ఈ క్యాలెండర్ 'చీకట్లో ప్రకాశించే' ప్రత్యేకతను కలిగి ఉందని చెప్పారు. దీనివల్ల భక్తులు పగలు, రాత్రి కృష్ణుడిని దర్శించుకునే అవకాశం పొందుతారన్నారు.

30న రంజాన్‌పై సదస్సు

సీతమ్మధార: ముస్లింల పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు ఐఏఆర్ఎఫ్ చైర్మన్ నరవ ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్ వేదికగా ఆదివారం ఉదయం 10 గంటలకు రంజాన్ ప్రత్యేకతలపై సదస్సు జరుగుతుందని తెలిపారు. ఇదే రోజున తెలుగు వారికి ఉగాది, క్రైస్తవులకు ఎల్‌ఈఎస్‌టీ సీజన్ పునరుద్ధానం, ముస్లింలకు రంజాన్ పర్వదినాలు జరగనుండటంతో సర్వమత సమభావన ప్రాముఖ్యాన్ని తెలిపేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

కోల్‌ఫిట్ పరీక్షతో కొలొరెక్టల్ క్యాన్సర్‌కు చెక్


అపోలో ఆస్పత్రిలో కోల్‌ఫిట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అంకాలజీ వైద్యులు

ఆరిలోవ: కొలొరెక్టల్ క్యాన్సర్(పెద్ద ప్రేగు)ను కోల్‌ఫిట్ పరీక్షల ద్వారా నివారించవచ్చని అపోలో అంకాలజీ వైద్య బృందం తెలిపింది. హెల్త్‌సిటీ అపోలో హాస్పిటల్ అంకాలజీ విభాగంలో బుధవారం కొలొరెక్టల్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోల్‌ఫిట్ పరీక్ష విభాగాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా కోల్‌ఫిట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అపోలో మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వరుణ్‌తేజ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడానికి ఇది అత్యాధునిక స్క్రీనింగ్ పరీక్షని తెలిపారు. దీని వల్ల రోగి క్యాన్సర్ నుంచి బయట పడడానికి వీలుంటుందని, సకాలంలో మెరుగైన చికిత్స అందించవచ్చని చెప్పారు. ఈ వ్యాధి ఒకప్పుడు పెద్ద వయసుల వారికి వచ్చేదని, ఇప్పుడు యువకుల్లో సైతం వస్తోందన్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ సుమన్ దాస్ మాట్లాడుతూ కొలొరెక్టల్ ఫిట్, కొలొనోస్కోపీతో పరీక్షలు చేయించుకోవడం వల్ల క్యాన్సర్ తీవ్రత పెరగకుండా చూడవచ్చన్నారు. దీని ప్రభావం 45 ఏళ్ల నుంచి 75 ఏళ్ల మధ్య వయస్కుల్లో ఉంటుందని తెలిపారు. ఆయా వయసుల వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపోలో ఆస్పత్రిలో అత్యాధునిక స్క్రీనింగ్ పరీక్షల విభాగం అందుబాటులో రావడం వల్ల ఈ క్యాన్సర్‌ను ముందుగానే కనుక్కోవచ్చన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికురాలి మృతి

ఆరిలోవ: హనుమంతవాక వద్ద గోడ నిర్మాణ పనులు చేస్తుండగా ఓ కార్మికురాలు విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఆరిలోవ సీఐ మల్లేశ్వర రావు తెలిపిన వివరాలిలా.. హనుమంతవాక కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ అధికారులు కొద్ది రోజులుగా రక్షణ గోడ నిర్మాణ పనులు కాంట్రాక్టర్ ద్వారా జరుపుతున్నారు. ఈ పనుల్లో భాగంగా మంగళవారం గణపతి రంభ(59) అనే మహిళ వాటరింగ్ చేస్తుండగా.. డ్రిల్లింగ్ మిషన్ వైరు తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో ఆమెను తోటి పనివాళ్లు విమ్స్‌కు తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యు లు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. అక్కయ్యపాలెంలో కార్మికురాలు రంభ నివసిస్తూ రోజు ఇక్కడ గోడ పనులకు వస్తుండేవారు. ఆమె మృతి చెందడంతో బంధువులు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య ఆరాధనోత్సవాలు


సత్యదేవ్‌ను సత్కరిస్తున్న చైతన్య బ్రదర్స్

సీతమ్మధార: తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 522వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం చైతన్య మ్యూజిక్ అసోసియన్ ఆధ్వర్యంలో సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయి మందిరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జగద్గురు పీఠం డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు భక్తిని, తత్వాన్ని ప్రబోధించడమే గాక వ్యక్తులను సంస్కరింప జేయడానికి, సామాజిక శ్రేయస్సుకు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ఆచార్య పురుషులు, సద్గురువులు తమ తమ మార్గాల ద్వారా ఆయా సంప్రదాయాల రూపంలో చిరంజీవులై ప్రకాశిస్తుంటారని పేర్కొన్నారు. అన్నమయ్య ఆరాధనోత్సవాల్లో భాగంగా చైతన్య బ్రదర్స్ బి.కృష్ణమాచార్య, వారణాసి వేంకటేశ్వరశర్మ అన్నమయ్య విగ్రహానికి పంచామృతాభిషేకం, షోడశోపచార పూజ శాస్త్రోక్తంగా జరిపారు. చైతన్య బ్రదర్స్ తమ ప్రసంగాల్లో అన్నమయ్య కృషిని, సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి, బాలకృష్ణ ప్రసాద్ చేసిన కృషిని ప్రస్తుతించారు. వర్ధంతి సభలో సత్యదేవ్‌ను చైతన్య బ్రదర్స్ సత్కరించారు. కార్యక్రమ నిర్వహణకు గణపతిరాజు ఇందిర, సుసర్ల మంజుల, ఆరిజన్ హాస్పిటల్స్ జనరల్ మేనేజర్ పడిమి భాస్కర్, బి.ప్రసన్న సహకరించారు. చైతన్య బ్రదర్స్ వద్ద శిక్షణ పొందిన సంగీత విద్యార్థులు ఆలపించిన 30 అన్నమాచార్య కీర్తనలు శ్రోతలకు వీనులవిందు చేశాయి.

అంతర్జాతీయ చట్టాల అధ్యయనంతో మెరుగైన ఉపాధి

- డీఎస్‌ఎన్‌ఎల్‌యూ వర్క్‌షాప్‌లో న్యాయ నిపుణులు


సావనీర్ ఆవిష్కరిస్తున్న గోవా లా యూనివర్సిటీ వీసీ ఆచార్య వెంకటరావు

సబ్బవరం: ప్రపంచీకరణతో ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిందని, దీంతో అంతర్జాతీయ చట్టాలు, న్యాయశాస్త్రం అవసరం మరింతగా పెరిగిందని గోవా అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్.వెంకటరావు అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్‌ఎన్‌ఎల్‌యూ)లో అంతర్జాతీయ చట్టంలో నూతన ధోరణులు, ఉద్యోగ అవకాశాలు అనే అంశంపై బుధవారం నిర్వహించిన వర్క్ షాపులో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంతర్జాతీయ, దేశీయ చట్టాల అధ్యయనం ఎలా అవకాశాలను సృష్టిస్తుందో వివరించారు. జాతీయ న్యాయ పరిశోధనల్లో ఒకప్పుడు విశాఖపట్నం దేశంలోనే ప్రముఖంగా ఉండేదని, ఆ వారసత్వాన్ని డీఎస్‌ఎన్‌ఎల్‌యూ కొనసాగించాలని ఆకాంక్షించారు. దేశాల మధ్య వివాదాలే కాకుండా, దేశ విదేశాల్లో వివిధ రకాల లావాదేవీలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించే కేటగిరీలో చాలా ఉద్యోగావకాశాలున్నాయన్నారు. అంతర్జాతీయ న్యాయ చట్టం అభ్యాసంతో ఉద్యోగ అవకాశాలు, విద్యావిధాన రూపకల్పన అభివృద్ధిపై న్యాయ నిష్ణాతులు.. పరిశోధకులు, న్యాయ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. అనంతరం ప్రపంచ న్యాయ సంస్థల్లో ఉపాధి మార్గాలు, అంతర్జాతీయ దౌత్యం, మధ్యవర్తిత్వంలో విద్యార్థులు, నిపుణులకు సహాయపడేందుకు రూపొందించిన గైడ్ ఆన్ కెరీర్స్ ఇన్ ఇంటర్నేషనల్ లా(సీఐఎల్ఏడీ) సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విదేశాంగ మంత్రిత్వశాఖలో చట్టపరమైన ఒప్పందాల విభాగం డైరెక్టర్ డాక్టర్ యడ్ల ఉమాశంకర్, వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశ రావు, రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మదాసు, సెంటర్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ లక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ బి.నీలిమ, డాక్టర్ ఎస్.కిరణ్‌కుమారి, షెర్లీ హెప్సిబా తదితరుల పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక పురోగతి


మహిళకు శిక్షణ ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

మద్దిలపాలెం: స్థానిక జన శిక్షణ సంస్థాన్‌లో సంకల్ప ప్రాజెక్ట్ కింద స్వల్పకాలిక నైపుణ్య శిక్షణ పొందిన వారు స్వయం ఉపాధిలో రాణిస్తే ఆర్థిక పురోగతి సాధించవచ్చని సంకల్ప ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి పేర్కొన్నారు. జన శిక్షణ సంస్థాన్‌లో 15 రోజులుగా స్కిల్ డెవలప్‌మెంట్ వారి సౌజన్యంతో జ్యూట్ బ్యాగ్‌లు, వర్మీ కంపోస్ట్, అగర్‌బత్తి తయారీలో డ్వాక్రా మహిళలకు శిక్షణ ఇచ్చారు. జేఎస్‌ఎస్‌లో బుధవారం వీరికి సంకల్ప ప్రాజెక్ట్ డైరెక్టర్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి శిక్షణను మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ రామరాజు, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కథా కచేరీ


మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితీ ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీ అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలో చైతన్యం పాదుకొల్పే రచనలు కథలుగా రావాలన్నారు. పేదల జీవితాలు, సమస్యలను ప్రతిబింబించే రచనలు చేయాలని కోరారు. రచయిత కె.జి.వేణు కథానిక సాహిత్య విశ్లేషణపై ప్రసంగించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు కథా సాహిత్యంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రచయితలు చిన సూర్యనారాయణ, వినయభూషణరావు, కొత్తూరు రమణ, జ్యోతిర్మయి, నిర్మాలాదేవి, శ్రీనివాసరావు, పరమేశ్వరరావు, కుమార్ తదితరులు తాము రచించిన కథలను చదివి వినిపించారు.

చినవాల్తేరు ఆశ కార్యకర్తకు షోకాజ్ నోటీస్

- వివాదాస్పదంగా మారిన డీఎంహెచ్‌వో నిర్ణయం

మహారాణిపేట: చినవాల్తేరు యూపీహెచ్‌సీలో పనిచేస్తున్న ఒక ఆశ కార్యకర్తకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ జగదీశ్వరరావు షోకాజ్ నోటీస్ జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. అలాగే డీఎంహెచ్‌వో బుధవారం ఆకస్మికంగా యూపీహెచ్‌ను సందర్శించి, అనంతరం ఆశ వర్కర్ సర్వే చేస్తున్న ప్రాంతానికి వెళ్లారు. సర్వే సమయంలో యూనిఫాం ధరించకపోవడం, అలాగే సర్వే సరిగా నిర్వహించడం లేదని ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రుతు సమస్యల కారణంగా యూనిఫాం వేయలేదని ఆమె చెప్పగా.. యూనిఫాం తప్పనిసరి అని డీఎంహెచ్‌వో స్పష్టం చేశారు. దీంతో యూనిఫాం వేసుకుంటానని చెప్పడంతో అక్కడి నుంచి డీఎంహెచ్‌వో వెళ్లిపోతూ.. అందరూ బాగా పనిచేయాలని సూచించారు. కాగా.. ఈ నెల 21న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. విధులకు గైర్హాజరై ఆందోళనలో పాల్గొనేలా అందరినీ ఈ ఆశ వర్కరే ప్రోత్సహించారని.. డీఎంహెచ్‌వో ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. దీనిపై ఆమె వివరణ కూడా ఇచ్చారు.

ప్రాంగణ నియామకాలతో విద్యార్థులకు తోడ్పాటు


సంస్థ ప్రతినిధులను సత్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో వసుధ ఫార్మ కెమ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తోంది. ఎంఎస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్, ఎం.ఫార్మసీ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఈ ప్రాంగణ నియామకాల్లో అవకాశాలు కల్పిస్తున్నారు. రీసెర్చ్ డెవలప్‌మెంట్ ప్రొడక్షన్ క్వాలిటీ కంట్రోల్ తదితర విభాగాలకు విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు. దీనిలో భాగంగా సంస్థ ఆపరేషన్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.కిషోర్‌కృష్ణ, కార్పొరేట్ హెచ్‌ఆర్ సి.హెచ్.ఎస్ రామశర్మలతో కూడిన నిపుణుల బృందం బుధవారం ఏయూకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఏయూ తరఫున వీరిని రిజిస్ట్రార్ సత్కరించారు. ప్రాంగణ నియామకాలను సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్స్–కార్పొరేట్ రిలేషన్స్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ పి.మోహన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ మహిళల బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో ఆచార్య విజయమోహన్

విశాఖ విద్య: ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొననున్న ఏయూ మహిళల బ్యాడ్మింటన్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. వివిధ కళాశాల నుంచి ఎంపికైన క్రీడాకారులు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరఫున ఆడనున్నారు. ఈ పోటీలు అలగప్పా విశ్వవిద్యాలయం కరైకుడిలో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు జరగనున్నాయని ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ తెలిపారు. కోచ్‌గా బి.జ్యోతిక, మేనేజర్‌గా డాక్టర్ జి.వెంకటేశ్వరరావు వ్యవహరించమన్నట్లు చెప్పారు. జట్టులో ఆర్.కావ్యశ్రీ, ఎం.రాధా శ్రవంతి, ఆర్.కల్యాణి, వై.హిమబిందు, జి.స్వాతి, వి.నాగమాధవి, జె.హైమావతి, పి.శ్రవంతి, జి.స్నేహా, పి.కీర్తన ఆడనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను విజయమోహన్ అభినందించారు. క్రీడాకారులకు ట్రాక్ షూట్‌తోపాటు టీఏ, డీఏ కూడా అందించనున్నట్లు తెలిపారు. ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో క్రీడా ప్రతిభ చూపి ఆంధ్రా యూనివర్సిటీకి పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంవీపీకాలనీ: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గిరిజన ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సంఘ అధ్యక్షుడు సోనాయి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కటారి శోభన్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులతో ప్రత్యేకంగా సంఘ ప్రతినిధులు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా బుధవారం హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న ఎస్టీ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సర్వీస్ రెగ్యులరైజేషన్, ప్రమోషన్స్, ఎస్టీ లైజన్ ఆఫీసర్ నియామకం, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, ప్రభుత్వ పథకాల మంజూరు వంటి అంశాలపై వారితో చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలను సంఘం దృష్టికి తీసుకురాగా.. త్వరలో వాటి పరిష్కారం దిశగా ఉన్నతాధికారులను కలవనున్నట్లు తెలిపారు. అన్ని సంస్థల ఉద్యోగులతో సమావేశాలు నిర్వహించి, సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందన్నారు.